క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేటలోని జైహింద్ కాంప్లెక్స్ వద్ద భారత వికాస్ పరిషత్ విజయవాడ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో దాతలు, సంస్థలు, వ్యాపార వర్గాలు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు, మజ్జిగ పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేసి పేదలను ఆదుకోవాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన భారత వికాస్ పరిషత్ ప్రతినిధులను అభినందించారు. జూన్ మొదటి వారం వరకు చలివేంద్రం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. భారత్ వికాస్ పరిషత్ అధ్యక్షులు ఎంపీఎస్ఎస్‌వీ ప్రసాద్, సెక్రెటరీ వెంకటరమణ, జగదీష్ గుప్తా, కమల్ నారాయణ్ బంగ్, ఎం వి రామ్ చంద్రరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మధురానగర్(విజయవాడసెంట్రల్):పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వైఎస్సార్ సీపీ 31వ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం తెలిపారు. గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగర పాలక సంస్థ పాఠశాల సమీపంలో శనివారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం సందర్భంగా వికాస తరంగిణి ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వికాస తరంగిణి సభ్యురాలు వెంకట్రావమ్మ మాట్లాడుతూ ప్రపంచ ధరిత్రీ దినోత్సవం పురస్కరించుకుని మన భూమి మన బాధ్యత పేరిట అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. నినాదాలు చేస్తూ ముత్యాలంపాడు, సత్యనారాయణపురం, భగత్‌సింగ్ రోడ్డు, జీఎస్ రాజు రోడ్డు, బీఆర్‌టీఎస్ రోడ్డుమీదుగా ర్యాలీ కొనసాగింది.

నిరుపేదలకు అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్):సీవీఆర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన శనివారం నిరుపేదలకు గార్లపాటి నాగరాజు సహకారంతో అన్నదానం జరిగింది. సుమారు 300 మందికి అన్నదానం చేశారు. క్లబ్ అధ్యక్షులు అన్నాబత్తుల శరాబంధీరావు, సభ్యులు కృష్ణారావు, నాగరాజు హనుమంతరావు, నారాయణ, జి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతిలో 44 శాతం వాల్యూయేషన్ పూర్తి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పదో తరగతి మూల్యాంకన 44 శాతం పూర్తయినట్లు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి తెలిపారు. నగరంలోని బిషప్ హజరయ్య హైస్కూల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి మూల్యాంకన కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. కేంద్రంలో ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. వాల్యూయేషన్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇప్పటి వరకు 89,485 ఆన్సర్ స్క్రిప్ట్స్ మూల్యాంకనం పూర్తయిందన్నారు. వాల్యూయేషన్ కేంద్రాన్ని సందర్శించిన వారిలో డీఈఓ సీవీ రేణుక, ఏసీడీఈ కేవీఎన్ కిరణ్ ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళ నగర బహిష్కరణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):నగరంలో గంజాయి అమ్ముతున్న మహిళను నగర పోలీస్ కమిషనర్ టీకే రాణా నగర బహిష్కరణ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివసిస్తున్న జొన్నలగడ్డ సారమ్మ అలియాస్ శారద అనే మహిళ నిబంధనలకు విరుద్ధంగా గంజాయి విక్రయిస్తూ పలుమార్లు పోలీసులకు పట్టుబడింది. జైలుకు వెళ్లి వచ్చినా కూడా ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడం, ప్రధానంగా నగరంలోని యువతను పెడదోవపట్టించేలా గంజాయి విక్రయాలు చేస్తోంది. తన నేరప్రవృత్తిని మార్చుకోకపోవడంతో సీపీ ఆమెను నగరం నుంచి బహిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. నగర ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు ప్రవర్తించినా వారిపై ఇలానే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరస్తులు తమ ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



సింగ్‌నగర్ ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ప్రత్యేక ప్రార్థనల అనంతరం మత పెద్దలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ రుహుల్లా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):రంజాన్ పండుగ వేడుకలు సింగ్‌నగర్, పాయకాపురం పరిసర ప్రాంతాల్లో శనివారం ఘనంగా జరిగాయి. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని గుజ్జల సరళాదేవి కళ్యాణమండపం, షాదీఖానా దర్గా గ్రౌండ్, సుందరయ్యనగర్, కండ్రిక ప్రాంతాల్లో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, ఎండీ హఫీజుల్లా, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు ఇతర నాయకులు పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ముస్లిం మైనార్టీలంటే అమితమైన ప్రేమ అని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముస్లింలకు అన్ని రంగాల్లో సముచితస్థానం కల్పించారని తెలిపారు. ముస్లింలపై చంద్రబాబు చూపింది కపటప్రేమ అని విమర్శించారు. మైనార్టీలకు చంద్రబాబు చేసిందేమి లేదన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లిం మైనార్టీల కోసం 4 శాతం రిజర్వేషన్ తీసుకొస్తుంటే చంద్రబాబు కోర్టులకు వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారని ధ్వజమెత్తారు. ముస్లిం మైనారీలెవ్వరూ టీడీపీని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. జగనన్న ప్రభుత్వ పాలనలో మసీదులు, దర్గాలు, ఈద్గాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించారు.

ఎమ్మెల్సీ రుహుల్లా మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే గత ప్రభుత్వాలు భావించాయన్నారు. కానీ మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే ముస్లింలను తన సొంత కుటుంబ సభ్యులుగా భావించి అసలైన గుర్తింపును ఇచ్చారని పేర్కొన్నారు. డెప్యూటీ సీఎం వంటి పదవులను సైతం అందించిన గొప్ప సీఎం జగనన్నే అన్నారు. ముస్లింలంతా ఎల్లప్పుడూ జగనన్నకు అండగా నిలుస్తారన్నారు.

బాలి మృతి కళారంగానికి తీరని లోటు



బాలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వివిధ సంస్థల ప్రతినిధులు

విజయవాడ కల్చరల్:చిత్రకారుడు బాలి మృతి చిత్ర కళారంగానికి తీరనిలోటు అని పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం వ్యవస్థాపకుడు గోళ్ళ నారాయణరావు అన్నారు. మల్లెతీగ సాహిత్య మాసపత్రిక, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, 64 కళలు. కామ్, ఫోరమ్ ఫర్ ఆర్టిస్ట్, జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో చిత్రకారుడు బాలి సంతాప సభ బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ చిత్ర కళారంగానికి బాలి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి.ఆంజనేయులు మాట్లాడుతూ బాలి చిత్రకారునిగా కార్టూనిస్ట్‌గా ఎందరో యువకులకు స్ఫూర్తినిచ్చారన్నారు. నగరంలో ఆయనకు విడదీయలేని అనుబంధం ఉందన్నారు. సీనియర్ కార్టూనిస్ట్ ఏవీఎమ్ ఆయనతో అనుబంధం గుర్తు చేసుకున్నారు. నగరంలో ఆయనతోపాటు అనేక కార్యక్రమాలలో పాల్గొన్నానని చిత్రకళకు సంబంధించిన అనేక విషయాలను వివరించేవారని పేర్కొన్నారు. మల్లెతీగ సాహిత్య మాసపత్రిక సంపాదకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ బాలి కథల సంపుటి ఆవిష్కరణ నగరంలోనే జరిగిందని చెప్పారు. కృష్ణా జిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్ పర్సన్ టి.జమలపూర్ణమ్మ మాట్లాడుతూ కళాకారులు, రచయితలకు మరణం లేదని వారి చిత్రాల ద్వారా, రచనల ద్వారా ప్రజల గుండెల్లో నిలిచిపోతారన్నారు. వివిధ సంస్థల ప్రతినిధులు, గుండు నారాయణ, తోపాటు పలువురు అభిమానులు పాల్గొన్నారు. బాలి చిత్రపటానికి నివాళి సమర్పించారు. చిత్రకారుడు కళాసాగర్ నిర్వహించారు

నేడు దుర్గమ్మ సన్నిధిలో మహాలక్ష్మి యాగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అక్షయ తృతీయను పురస్కరించుకుని ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మహాలక్ష్మీ యాగం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి విగ్రహం వద్ద యాగశాలలో ఉదయం 9 గంటలకు యాగం ప్రారంభమవుతుందన్నారు. రూ.వెయ్యి టికెటు కొనుగోలు చేసిన భక్తులు ఈ యాగంలో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. యాగం అనంతరం ఉభయదాతలకు శేషవస్త్రం, రవిక, పెద్ద లడ్డూ, చక్రపొంగలి, పులిహోర ప్రసాదాలు అందిస్తామని తెలిపారు.

అంబేడ్కర్ స్మృతివనం పనులు పరిశీలన



పటమట(విజయవాడతూర్పు):స్వరాజ్య మైదానంలో అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని క్వాలిటీ కంట్రోల్ అధికారులను ఆదేశించారు. అన్ని భాగాలు కలిపి చాలా జాగ్రత్తగా విగ్రహ నిర్మాణం చేయాలని సూచించారు. ఇది అద్భుతమైన ప్రాజెక్ట్‌ని, ఎక్కడ పొరపాట్లు లేకుండా చూడాలని పేర్కొన్నారు. నిర్ణీత గడువు లోగా అన్ని పనులను పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు కార్మికులను నియమించుకోవాలని సూచించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులు, ఏపీఐఐసీ, కేసీపీ ప్రాజెక్ట్ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఉచిత పుస్తక పంపిణీ ప్రారంభం



పటమట(విజయవాడతూర్పు): విజ్ఞానదాయక సమాజ ఆవిర్భావానికి ఉచిత పుస్తక పంపిణీ ద్వారా వేలాది మందికి ఏడేళ్లుగా పుస్తక జ్ఞానాన్ని పంచుతున్న ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం సేవలు అపురూపమైనవని విజయవాడ సిద్ధార్థ విద్యా సంస్థల అధ్యక్షుడు డాక్టర్ సి. నాగేశ్వరరావు అన్నారు. పుస్తక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యాన శనివారం పటమట శ్రీ సర్వోత్తమ భవనంలో నిర్వహించిన ఉచిత పుస్తక పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వేలాది పుస్తకాలు విషయ ప్రాతిపదికగా విభజించి ప్రదర్శించటం కనుల పండువగా ఉందని చెప్పారు. ఎక్కడా లభించని పుస్తకాలు ఉచితంగా అందించడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద మాట్లాడుతూ ఏడేళ్లుగా ఈ పుస్తక ప్రదర్శన ద్వారా 2 లక్షలకు పైగా పుస్తకాలు ఉచితంగా అందించామని పేర్కొన్నారు. దాతలు తమకు ఇచ్చిన పుస్తకాలను అందరికీ అందించడం పుస్తక దాత, పుస్తక స్వీకర్త కూడా సంతోషిస్తున్నారన్నారు. ఈ ప్రదర్శన, పంపిణీలో సాధారణ గ్రంథాలతో పాటు తత్వశాస్త్రం, మతాలు, ఆధ్యాత్మిక, సాంఘిక, భాష, ఇంజినీరింగ్, వైద్య, విజ్ఞాన శాస్త్రాలు, కళలు, తెలుగు, ఆంగ్ల సాహిత్య గ్రంథాలు, చరిత్ర, బాల సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం పుస్తకాలతోపాటు పదవ, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు సంబంధించి వివిధ విద్యా సంస్థల స్టడీ మెటీరియల్స్ తో కలిపి దాదాపు 50 వేలకు పైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

కనులపండువగా జైనుల శోభాయాత్ర

వైభవంగా వర్షితప్ ముగింపు ఉత్సవం



జైన గురువు అభినందన్‌చంద్ర సాగర్‌కు స్వాగతం పలుకుతున్న సంఘం కార్యదర్శి పన్నాలాల్‌జైన్



ఉపవాసదీక్షలు ఆచరించిన జైనులను వాహనాల్లో ఊరేగిస్తున్న కుటుంబ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):జైనుల వర్షితప్ ముగింపు ఉత్సవం శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. ఏడాది పాటు నిర్విరామంగా కొనసాగించిన వర్షితప్ దీక్షల ముగింపు కార్యక్రమాన్ని జైన సంఘాల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నగరంలో నిర్వహించారు. పాతబస్తీలోని శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్ సంఘ్ ఆధ్వర్యంలో రెండు రోజుల ఉత్సవాన్ని స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జైనులు ఉపవాసదీక్షలను ఆచరించిన వందలాది మంది వ్యక్తులను వివిధ వాహనాల్లో ఊరేగిస్తూ నగరంలో భారీ శోభయాత్ర నిర్వహించారు. ఏ కన్వెన్షన్ సెంటర్ నుంచి ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్ వరకూ ఈ శోభయాత్ర జరిగింది. నృత్యాలు చేస్తూ సందడి చేశారు. సంఘ్ అధికార ప్రతినిధి ప్రవీణ్ రాంకా మాట్లాడుతూ జైన సంప్రదాయంలో ఏడాది పాటు కొనసాగించే ఉపవాసదీక్షను వర్షితప్‌గా పిలుస్తారని చెప్పారు. ఈ దీక్షలో ఒక రోజు ఆహారాన్ని స్వీకరిస్తే మరుసటి రోజు పూర్తిగా ఉపవాసాన్ని ఆచరిస్తారన్నారు. ఏడాది పొడవున దీక్షను కొనసాగించి అక్షయతృతీయ రోజును విరమిస్తారన్నారు. ఈ ఏడాది నగరంలోని సుమారు 250 కుటుంబాల నుంచి సభ్యులు దీక్షను ఆచరించారన్నారు. వారి దీక్షా విరమణ సందర్భంగా బంధువులు, నగరంలోని వేలాది మంది జైనులతో సామూహికంగా వర్షితప్ ముగింపు ఉత్సవాన్ని వైభవంగా జరుపుతున్నామన్నారు. రెండు రోజుల ఉత్సవానికి పది వేల మంది జైనులు హాజరవుతున్నట్లు వివరించారు. రెండు ప్రాంగణాల్లో శని, ఆదివారాల్లో వివిధ కార్యక్రమాలుంటాయన్నారు.

ఉపవాసదీక్ష సమాజాన్ని సంస్కరిస్తుంది....

ఉపవాసదీక్షలు సమాజాన్ని సంస్కరిస్తాయని ప్రముఖ జైన గురువు పరమపూజ్య అభినందన్ చంద్రసాగర్ అన్నారు. వర్షితప్ ముగింపు ఉత్సవానికి చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. జైన తీర్థంకురులలో మొదటివారైన ఆదినాథ్ ప్రభుజీ స్వయంగా ఉపవాసదీక్షను ఆచరించి జైనులకు ప్రబోధించారన్నారు. ఉపవాసదీక్షలతో సమాజంలోని ఆకలిదప్పికలు తెలుస్తాయన్నారు. తద్వారా ఎవరూ ఆకలితో ఉండకూడదనే భావన పెరిగి సమాజంలో చక్కని శాంతి సమానత్వాలు వర్ధిల్లుతాయన్నారు. జైనం ఈ సందేశాన్ని ప్రపంచానికి బోధిస్తుందని వివరించారు. సంస్థ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ బోడోతరియా, ప్రధాన కార్యదర్శి పన్నాలాల్ జైన్ ఉపాధ్యక్షుడు అశోక్ జైన్, జయంతిలాల్ జైన్, సహాయక కార్యదర్శి భోగిలాల్ జైన్, కోశాధికారి డుంగరమల్ జైన్, సహా కోశాధికారి రాహుల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

30 న మేడే సాంస్కృతిక ఉత్సవాలు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు):ఈ నెల 30వ తేదీ సిద్ధార్థ ఆడిటోరియంలో జాషువా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో మేడే సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహిస్తున్నామని సాంస్కృతిక వేదిక నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. పాటలు, పద్యాలు, జానపద నృత్యాలు, డప్పు నృత్యాలు, వాయిద్య కళా ప్రదర్శనలు, కార్మిక కుటుంబాల పిల్లలచే ఫ్యాన్సీ డ్రెస్ షో, గీతాలాపన, విచిత్ర వేషధారణ, పాట కచేరి, నాటికల ప్రదర్శనలు ఉంటాయన్నారు.

● ఆరోగ్యమే మహాభాగ్యం !



ఆరోగ్యంపై అవగాహన పెరిగిన నేపథ్యంలో నగరవాసులు వాకింగ్, వ్యాయామంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియానికి ఉదయం, సాయంత్రం వేళ పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. వాకింగ్, వామ్‌అప్, ఇతర వ్యాయామాలు చేసుకుంటూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

భక్తులకు చేయూత అందించాలి



బాబా ఆలయంలో ముస్లిం మహిళలకు తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు , సుధాస్వామి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దాతృత్వంతో భక్తులకు చేయూత నందించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లిం మహిళలకు నిత్యావసరాలు అందించి చేయూత నివ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. శనివారం రంజాన్‌ను పురస్కరించుకుని లెనిన్ సెంటర్ షిర్డీ సాయిబాబా మందిరంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగమానసాదేవి అమ్మవారికి హారతి ఇచ్చారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తోఫాను పేద మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబా భక్తులు దాతృత్వం అలవర్చుకోవాలని, పేదల అభ్యున్నతికి చేయూత అందించాలని కోరారు. పేదలకు సాయం అందించడం ద్వారా బాబా కృపకు పాత్రులు కాగలరని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన సుధాస్వామిని అభినందించారు. మందిర నిర్వాహకుడు సుధాస్వామి మాట్లాడుతూ అన్ని మతాల పండుగలకు పేదలకు మందిరంలో సాయం అందిస్తున్నామని చెప్పారు. సర్వమతాల సారాంశం ఒక్కటే అన్న బాబా బోధనలకు అనుగుణంగా మందిరంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇంచార్జి ఆత్మకూరి సురేష్, వెన్నం రత్నారావు, వడ్డీ శ్రీనివాసులు, అక్బర్, పంచుమర్తి రాజేష్, య ర్రంశెట్టి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

అవసరాలకు అనుగుణంగా లయన్స్ సేవలు



లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దామర్ల శ్రీశాంతి, శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్):ప్రజల అవసరాలకు అనుగుణంగా లయన్స్ సేవలు అందిస్తున్నామని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గవర్నర్ దామర్ల శ్రీశాంతి అన్నారు. రామకృష్ణాపురంలో శనివారం లయన్స్ క్లబ్ విజయవాడ ఇమేజ్ ఆధ్వర్యాన డిస్ట్రిక్ట్ గవర్నర్స్ యాన్యువల్ అఫీషియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. లయన్స్ క్లబ్‌తో పాటు ఇందిరా మహిళా మండలి ద్వారా మహిళల అభ్యున్నతికి కె.మాధవీలత చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. అనంతరం గవర్నర్ దామర్ల శ్రీశాంతి, శ్రీనివాసరావు దంపతులను లయన్స్ సలహాదారు కేవీ రామారావు, డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ మాధవీలత తదితరులు సత్కరించారు. తొలుత రామకృష్ణాపురంలోని శ్రీ అలివేలు మంగపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. రామకృష్ణాపురంలోని లయన్స్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించి సేవలను పరిశీలించారు. ఇమేజ్ క్లబ్ అధ్యక్షురాలు కె అలివేలు, కార్యదర్శి సాచిచంద్, కోశాధికారి ఓవీ నాగమణి, ఉపాధ్యక్షులు సుజాత, పద్మజ, క్యాబినెట్ సెక్రటరీ డా. వై గాంధీ, క్యాబినెట్ కోశాధికారి పీ ప్రభాకర్‌రావు, శశిధర్, నెక్కంటి ప్రసాద్, పెనుమత్స అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టిన నాటకాలు



ప్రక్షాళనం నాటకంలోని రసవత్తర సన్నివేశం



రంగస్థల ప్రముఖుడు ఎమ్ఎస్ చౌదరికి ఎన్టీఆర్ పురస్కారం ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

విజయవాడ కల్చరల్: తపస్వి కల్చరల్ ఆర్ట్స్, ఎస్‌వీఆర్ కళాకేంద్రం, కొడాలి బ్రదర్స్ ఆధ్వర్యంలో సినీ నటుడు ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న జాతీయ ఆహ్వాన నాటకల ప్రదర్శనలు సమాజంలో నేడు జరుగుతున్న వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టాయి. శనివారం నాటి ప్రదర్శనలలో తొలి నాటకంగా రాచకొండ విశ్వనాథ శాస్త్రి రచనకు ఎమ్ఎస్ చౌదరి దర్శకత్వం వహించిన పిపీలకం నాటకం ప్రదర్శించారు. మానవుడు సంఘజీవి అతని జీవితం సంఘంతోనే ముడిపడి ఉంటుంది. సంఘంతో అన్ని రంగాలతోపాటు పేదలు, బడుగు బలహీన వార్గల వారు ఉంటారు. బలవంతుడు బలహీనులను అణచివేయాలే ప్రయత్రం చేస్తాడు. వారిని ఎదిరించి తమ ఉనికిని కాపాడుకోవడమే నాటక ఇతి వృత్తం. ఇందులో చీమలను ప్రధాన పాత్రగా చేయడం, అందరూ యువకులే నటించడం విశేషం. రెండవ నాటికగా చెరుకూరి సాంబశివరావు రచించి దర్శకత్వం వహించిన ప్రక్షాళన నాటకం ప్రదర్శించారు. మన దేశంలో రోజు రోజుకూ ఆడవారిపై అత్యాచారాలు జరుగుతున్నాయి.. హత్యలు పేట్రేగిపోతున్నాయి. ప్రపంచీకరణ నేపథ్యంలో సమాజ స్వరూపమే మారిపోయింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల టెక్నాలజీని అడ్డం పెట్టుకొని యువత దారి తప్పుతోంది. సమాజాన్ని ప్రక్షాళన చేయాలనే సందేశంతో నాటకం సాగింది. ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా ఎందరో యువ నటీనటులును తయారు చేసి వారిని నాటక రంగం వైపు మళ్లించిన దర్శకుడు ఎమ్ఎస్ చౌదరికి ఎన్టీఆర్ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా ప్రారంభించారు. తెలుగు నాటక రంగలో వస్తున్న మార్పులు అంశంగా ప్రసంగించారు. వివిధ రంగాలకు చెందిన అంబటి మధుమోహన కృష్ణ, దొంతాల ప్రకాష్, అరెకపూడి రామకృష్ణ చౌదరి, దేవినేని కిషోర్‌కుమార్, తపస్వి కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు సూర్యదేవర జగన్నాధరావు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా చిన్నారి పి.మహతి ప్రదర్శించిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది.

సహస్ర చండీ యాగానికి అందరూ ఆహ్వానితులే



చండీ విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న గౌతమ్‌రెడ్డి, గజల్ శ్రీనివాస్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 27వ తేదీ నుంచి మే 3వ వరకు నైనవరం ఫ్లెవైఓవర్ సమీపంలో నిర్వహిస్తున్న సహస్ర చండీ యాగ పూర్వక కుంభాభిషేకానికి ప్రతి ఒక్కరూ ఆహ్వానితులేనని ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి, గజల్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఫ్లైఓవర్ దిగువన నిర్మించిన యాగశాల వద్ద 72 అడుగుల అష్టభుజ మహా చండీ విగ్రహ నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి విగ్రహ నిర్మాణ పనులను గజల్ శ్రీనివాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ యాదల శ్రీనివాసరావు, పీఠాధిపతి కరుమారి దాసు, లఖంరాజు సునీత పరిశీలించారు. కరుమారి అమ్మన్ శక్తిపీఠం వద్ద నిర్వహిస్తున్న సహస్ర చండీ యాగానికి ప్రతి ఒక్కరూ విచ్చేసి యాగాన్ని వీక్షించవచ్చన్నారు. యాగానికి పలువురు మంత్రులతో పాటు ఆధ్యాత్మిక వేత్తలు, పీఠాధిపతులు విచ్చేయనున్నారని పేర్కొన్నారు. పీఠం కోశాధికారి జ్ఞానేశ్వర్, సత్య శ్రీహరి, శంకరరెడ్డి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

జ్యూస్‌స్టాల్లో చోరీ

చిట్టినగర్:సాయిరాం థియేటర్ సమీపంలోని మొయిన్‌రోడ్డులోని ఓ జ్యూస్‌స్టాల్ తాళాలు పగలగొట్టి నగదు చోరీకి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. రాజీవ్‌శర్మనగర్‌కు చెందిన పి.శ్రీనివాస్ దంపతులు సాయిరాం థియేటర్ ఎదుట శ్రీనివాస పాన్ అండ్ కూల్‌డ్రింక్ పేరిట జ్యూస్ స్టాల్ నిర్వహిస్తుంటారు. ప్రతి రోజు ఉదయం షాపు తెరిచి రాత్రి 10 గంటల వరకు వ్యాపారం చేస్తుంటారు. శుక్రవారం ఉదయం షాపు తెరిచేందుకు వెళ్లిన శ్రీనివాస్‌కు షాపు తాళాలు పగలగొట్టి కనిపించాయి. దీంతో లోపలకు వెళ్లి చూడగా టీవీ స్టాండ్‌కు ఉన్న హ్యాండ్ బ్యాగ్‌లో కింద పడి ఉంది. అందులో రూ. 5 వేలు, మరో పర్సులో రూ. 4 వేలు, శుక్రవారం వ్యాపారం తాలుకా మరో రూ. 3700 కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పిచ్చి మొక్కల తొలగింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సమస్యలను స్వయంగా తెలుసుకుని సత్వరమే పరిష్కరించేందుకు తాము కృషి చేస్తున్నామని 30వ డివిజన్ కార్పొరేటర్ బి.జానారెడ్డి తెలిపారు. గద్దే వెంకట్రామయ్యనగర్, దావు బుచ్చయ్యకాలనీలో శనివారం స్థానికుల విజ్ఞప్తి మేరకు పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేపట్టారు.